ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 7 ఏప్రిల్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0


చనుబండలో రాములోరి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


తూర్పుయడవల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


తూర్పుయడవల్లిలో కల్యాణ మూర్తులు

కమనీయం..రమణీయం

జిల్లావ్యాప్తంగా వైభవంగా సీతారాముల కల్యాణం

చనుబండలో..

చాట్రాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అపర భద్రాద్రి చనుబండ కోదండరామస్వామి ఆలయంలో సీతారామ కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలో పూజలు అనంతరం ఉదయం 11.45 గంటలకు పల్లకీలో శ్రీరామ లక్ష్మణులను, సీతమ్మను మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకొచ్చా రు. సుదర్శనం మాధవ శ్రీనివాసాచార్యులు యాజ్ఞీకులు ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణ క్రతువు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త


కల్యాణ వేడుకలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకస్వామి


చనుబండలో కల్యాణ మూర్తులు

పుచ్చకాయల చెన్న కేశవరెడ్డి దంపతులు, మరో 21 జంటల దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వ్యాఖ్యాతగా పరాంకుశం శ్రీనివాస్ వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. దాతల సహకారంతో భక్తులకు పులిహోర, మజ్జిగ, బెల్లం పానకం, తాగునీరు పంపిణీ చేశారు. సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చినవెంకన్న సన్నిధిలో..

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని సన్నిధిలో రాములోరి కల్యాణాన్ని నిత్యకల్యాణ మండపంలో అర్చకులు శ్రీవారి నిత్యకల్యాణంతో పాటుగా ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. మండప వేదిక వద్దకు స్వామి, అమ్మవార్లతో పాటు సీతారాముల కల్యాణ మూర్తులను, హనుమత్, లక్ష్మణసమేతంగా తెచ్చి బంగారు సింహాసనాలపై ఉంచి



అర్చకులు అలంకరించి కల్యాణతంతును ప్రారంభించారు. అభిజిత్ లగ్న శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింప చేశారు. అనంతరం మాంగల్యధారణ భక్తుల గోవింద, శ్రీరామ నామ స్మరణల నడుమ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తూర్పు యడవల్లిలో..

కామవరపుకోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రామాలయాలతో పాటు వాడవాడలా ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్ల వద్ద ఆదివారం సీతా రాముల కల్యాణం వైభవంగా జరిగింది. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. జిల్లాలో చిన భద్రాద్రిగా పేరొందిన కామవరపుకోట మండలం తూర్పు యడవల్లిలోని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత దేవాలయమైన సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో గత నెల 30వ తేదీ నుంచి జరుగుతున్న వసంత నవరాత్రోత్సవ ప్రయుక్త శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు అళహరి శేషాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.వి.ఎన్.ఎస్.మూర్తి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని భక్తులతో పాటు మాజీ మంత్రి దివంగత కోటగిరి విద్యాధరరావు సతీమణి విజయకుమారి (విజయమ్మ) తిలకించారు. కోటగిరి కుటుంబ సభ్యులు వేణుబాబు, కిషోర్‌బాబులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు వడపప్పు ప్రసాదం, పానకం, అన్నప్రసాద వితరణ జరిపారు.


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు


చింతలపూడిలో సీతా రాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్


చాటపర్రులో కల్యాణం తిలకిస్తున్న మురళీమోహన్


దుగ్గిరాలలో పానకం తయారీకి బెల్లం సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


ఏలూరులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు


ఏలూరు అమీనాపేట అభయ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి దంపతులు

ఇంటర్ విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ

- డీపీటీవో వరప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమైన దృష్ట్యా వారికి బస్‌పాస్‌లను జారీ చేస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పాత ఐడీ కార్డుతో పాస్ జారీ చేస్తారని తెలిపారు. విద్యార్థులు పాత ఐడీ కార్డును చూపించి ఆర్టీసీ బస్సు పాస్ రాయితీ పొందాలని సూచించారు.

■ లోపలి పేజీలో..



గిరిజన గ్రామాల్లో దాహం కేకలు

ఆరోగ్యమే మహాభాగ్యం



పెరుగుతున్న అనారోగ్య బాధితులు
బడ్జెట్‌లో పావు వంతు మందులకే
పోటీ పడుతున్న సుగర్, బీపీ వ్యాధులు
ప్రజల్లో అవగాహన పెంచాలి
నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

రీ సర్వే..చిక్కులు!



ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌ల సమస్య

- ఆక్వాజోన్‌లోని చెరువులు నాన్ ఆక్వా జోన్‌లోకి..
- రెండు జిల్లాల్లో రెండు లక్షల ఎకరాలు నాన్ ఆక్వాలోకి..
- రీ సర్వేతో రైతులకు ఇబ్బందులు
- రేపు కైకలూరులో ఆక్వా రైతు సదస్సు
- మత్స్యశాఖ అనుమతులు నిలుపుదల
- ప్రభుత్వ పథకాలు వర్తించవని రైతులు గగ్గోలు

కైకలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే వల్ల ఆక్వా రంగానికి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. రీసర్వేతో గ్రామాల్లో చేపల, రొయ్యల చెరువులకు, పంటపొలాలకు కొత్తగా ఎల్‌పీ నెంబర్లు ఇచ్చారు. అయితే ఆక్వా జోన్‌లో ఉన్న లక్షలాది ఎకరాలు ఎల్‌పీ నెంబర్లతో నాన్ ఆక్వాజోన్‌లో ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాన్ ఆక్వా జోన్‌లో చేరడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు, విద్యుత్ రాయితీలు, ఇన్సురెన్సులు వర్తించని పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది మంది ఆక్వా రైతులు తెలుగుదేశం ప్రభుత్వంలో విద్యుత్ రాయితీలు వర్తిస్తాయని ఆశతో మత్స్యశాఖ అనుమతుల కోసం పోర్టల్‌లో దరఖాస్తు పెట్టుకోగా ఎల్‌పీ నంబర్ సమస్య వెలుగులోకి వచ్చింది. గత నెల మొదటి వారం నుంచి ఈ సమస్య తెరపైకి రాగా మత్స్యశాఖ అధికారులు అనుమతులను తాత్కాలికంగా నిలిపివేశారు. మార్చికి ముందు ఆక్వా జోన్‌లో ఉన్నట్టు అనుమతులు పొందినప్పటికీ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎల్‌పీ నంబర్ మార్పుతో నాన్ ఆక్వాజోన్‌లో చేపల, రొయ్యల చెరువులు ఉన్నట్టు చూపిస్తోంది.

ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఈ ఎల్‌పీ నంబర్ సమస్య ఉత్పన్నం కావడంతో సుమారు 2 లక్షల ఎకరాలు నాన్ ఆక్వాజోన్‌లో చూపిస్తున్నట్టు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కైకలూరు నియోజకవర్గంలో 85 వేల ఎకరాలు ఆక్వా చెరువులు ఉండగా వాటిలో కైకలూరు మండలంలో 10, 560 ఎకరాలు, కలిదిండి 16 వేలు, మండవల్లి 12 వేలు, ముదినేపల్లి మండలంలో 10,800 ఎకరాలు నాన్ ఆక్వాజోన్‌లో ఉన్నట్లు చూపిస్తోంది.

8న కైకలూరులో ఆక్వారైతు సదస్సు

ఆక్వా రైతుల సమస్యలపై ఈ నెల 8న కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆక్వా రైతు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ఎస్‌ఏడీఏ) కోవైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి హాజరవుతున్నారు. రీ సర్వేలో వచ్చిన ఎల్‌పీ నంబర్‌తో వచ్చిన సమస్యను, ఏపీ సడా యాక్ట్‌లో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

దీనిని స్థానికంగా రైతులు మార్పు చేసుకోవాలంటే మండల, జిల్లాస్థాయి కమిటీల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రస్తుతం డీఎల్సీ జరిగే పరిస్థితి లేనందున గతంలో ఆక్వా జోన్‌గా గుర్తించిన చెరువులను మరలా పునఃరుద్ధరించి రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రీ సర్వే వల్ల రైతులకు ఇబ్బందులు



గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే వల్ల ఆక్వా రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకే ఎల్పీ నంబర్లో రెండు చెరువులకు చెందిన రైతులు వివరాలు ఉండడంతో రుణాలు పొందేందుకు అవకాశం లేదు. సరిహద్దులో ఉన్న చెరువులు ఒకటి ఆక్వాజోన్‌లో ఉంటే మరోటి నాన్ ఆక్వాజోన్‌లోకి వెళ్లింది. ప్రభుత్వ రాయితీలు వర్తించడం లేదు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లి గత రీసర్వేను పూర్తిగా నిలుపుదల చేసేలా అసోసియేషన్ ప్రయత్నిస్తోంది. ఈ నెల 8న కైకలూరులో జరిగే ఆక్వా సభలో ఏపీసడా ఛైర్మన్ దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు),
రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు, కైకలూరు

దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు..



కైకలూరు మండలం పెంచికలమర్రులో మూడెకరాల రొయ్యల చెరువు ఉంది. ఇటీవల విద్యుత్ బిల్లులు ఎక్కువగా రావడంతో మత్స్యశాఖ ద్వారా అనుమతులు తీసుకుని రాయితీ వచ్చేలా దరఖాస్తు చేసుకుందామని మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించా. చెరువు నాన్ ఆక్వాజోన్‌లో ఉందని ప్రస్తుతానికి అనుమతులు వచ్చే పరిస్థితులు లేవన్నారు. నెల రోజులుగా అనుమతులు కోసం మత్స్యశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.

- సైదు జోబాబు, ఆక్వారైతు, కొట్టాడ

నిలకడగా నిత్యావసరాలు!

- సన్‌ఫ్లవర్ బ్రాండెడ్ కంపెనీ ధరలు హెచ్చు
- మార్కెట్‌లో కిలో సన్‌ఫ్లవర్ రూ.147, వేరుశెనగ రూ.150
- ఎండుమిర్చి, వెల్లుల్లి యథాతథం
- పచ్చళ్ల సీజన్‌కు కొంత ఊరటే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

నిత్యావసరాల ధరలు నిలకడగానే కొనసాగుతున్నాయి. ప్రధానంగా నిత్యావసరాలు రైతుల నుంచి చేపట్టిన దిగుమతులపై 1.27 శాతం సుంకం వసూళ్లను చేపడుతుండటంతో ధరలు నిలకడగా ఉంటున్నాయి. ప్రభుత్వం వివిధ వర్తక, వ్యాపారాలపై దాడులు, నిత్యావసరాల అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్న హెచ్చరి కల నేపథ్యంలో ధరవరలు అందుబాటులోనే ఉంటున్నాయి. గత నెల రోజులుగా ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఆయిల్ ధరల్లో కొంత హెచ్చుతగ్గులు పది రోజుల నుంచి చోటు చేసుకుంటున్నాయి. సన్‌ఫ్లవర్ ఎక్కువగా ఉక్రెయిన్, రష్యాల నుంచి క్రూడ్‌గా మన దేశంలోనికి వస్తుంది. అయితే ప్యాకేజీ మాయాజాలం జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలు ఎక్కువగా వాడే సన్‌ఫ్లవర్ విషయంలోనే ఈ విధానాన్ని పాటిస్తూ బ్రాండెడ్ ఆయిల్ కంపెనీలు హెచ్చు ధరలకు అమ్మకాలు సాగిస్తున్నాయి. కిలో రూ.142కు విక్రయించే ఓ బ్రాండెడ్ కంపెనీ ఇటీవల రూ.147 నుంచి రూ.150కి విక్రయాలను చేస్తోంది. ప్యాకెట్‌పై ఎక్కువ ధరను చూపించి, కొంచెం తగ్గించినట్టుగా కొనుగోలు దారులకు చూపిస్తున్నారు. ఇక షాపింగ్ మాల్స్, ఇతర పెద్ద కొన్ని బ్రాండెడ్ మాల్స్‌లోను ప్యాకెట్‌పైన ఉన్న ధరకే విక్రయిస్తున్నారు. వేరుశెనగ నూనె, గానుగ బయట దుకాణాల్లో రూ.165 నుంచి రూ.170 లకు విక్రయిస్తున్నారు. ఎక్కువగా వేరుశెనగ పండే గుజరాత్‌లో బఫర్ నిల్వలుండటం వల్ల వేరుశెనగ నూనె ధరల్లో పెరుగుదల ఇప్పట్లో ఉండదని చెబుతున్నారు. కాగా ఎక్కువ మంది ప్యాకెట్ల కొనుగోలుపైన ఆధారపడడంతో ఆయా కంపెనీలు ధరలను రూ.2 నుంచి రూ.4 వరకు పెంపును అమలు చేస్తున్నాయి.



రైస్ రిచ్ ఆయిల్ డీమార్ట్‌లో రూ.110, మిగతా చోట్ల బయట మార్కెట్‌లో రూ.125 కిలో ప్యాకెట్ విక్రయాలు జరుగుతున్నాయి. మధ్య తరగతి ప్రజలు వాడే పామాయిల్‌లో లీటరు ప్యాకెట్ రూ.145కు, 800 గ్రాముల ప్యాకెట్‌ల రూపం లో రూ.120లకు విక్రయాలు జరుగుతున్నాయి. బియ్యం ధరలు కిలో రూ.65, రూ.67 పలుకుతున్నాయి. జీఎస్టీ అమలుతో ఈ ధరలకు కళ్లెం పడడం లేదు. మినపగుళ్ల రూ.140, నల్ల మినుములు రూ.120లకు విక్రయాలు జరుగుతున్నాయి. కొత్త పంట అందుబాటులోకి వచ్చినా ధరలు యథాతథంగానే ఉండడం గమనార్హం.

ఆవకాయకు ఊరటే..

ఈసారి ఎండుమిర్చి ఎగుమతులు గుంటూరు నుంచి కొంత స్తంభించాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఎండుమిర్చి ధర దిగి వచ్చింది. కూరలకు వాడే కారం కాయలు కిలో రూ.160-180లకు లభిస్తున్నాయి. గతేడాది రూ.220 పైనే అమ్మకాలు సాగాయి. పచ్చళ్లకు వాడే పాపడాలు కిలో రూ.300 పలుకుతుండగా గతేడాది రూ.400 పైనే అమ్మారు. బాడిగ(కర్నాటక) రకం ఇప్పుడు కిలో రూ.200 అమ్మకాలు జరుగుతున్నాయి. ధనియాలు కిలో రూ.120, వెల్లుల్లి రూ.120-రూ.150, జీలకర్ర రూ.300, మెంతులు, ఆవాలు రూ.140 పలుకుతున్నాయి.

పేదలకు అందని కందిపప్పు

కందిపప్పు ధర కిలో రూ.160కు పైనే అమ్మకాలు జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక రేషన్ కార్డుదారులకు కందిపప్పును అందుబాటులోకి తేకపోవడం కొంత విమర్శలకు దారితీస్తోంది.

రబీ ధాన్యం సేకరణ ప్రారంభం

118 రైతు సేవా కేంద్రాలు, 62 ప్రాక్యూర్‌మెంట్ ఏజన్సీల ద్వారా కొనుగోలు

జిల్లాలో సేకరణ లక్ష్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు.. సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌లు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 సంవత్సరంలో రబీ పంటకాలానికి సంబంధించి ధాన్యం సేకరణ ఈనెల 2వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది రబీలో 3.53 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తొలుత లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించినా రైతుల అభ్యర్థన మేరకు 2లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఆ ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేయడానికి జిల్లా పౌరసరఫరాల సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన గోనెసంచులను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. జిల్లాలో 22 మండలాల్లో సాగు చేసిన ధాన్యాన్ని 118 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. వీటికి అనుసంధానంగా 62 ప్రొక్యూర్‌మెంట్ సపోర్టింగ్ ఏజన్సీల (పీఎస్ఏ)లు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తారు. క్వింటాలుకు ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320, కామన్ రకం ధాన్యానికి రూ.2,300 చొప్పున ఇవ్వనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని ధాన్యం కొనుగోలు ఏజెన్సీల ద్వారా నియమించారు. ధాన్యం కొనుగోలు చేసే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో నిత్యం ఏదో ఒక సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ సమస్యలను పరిష్కారానికి ప్రత్యేకంగా జిల్లాలో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఏ సందేహాలున్నా కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910 లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

'జిల్లాలో రబీ ధాన్యాన్ని సేకరించటానికి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రైతులు మద్దతు ధర పొందడానికి ప్రభుత్వ నిబంధనల మేరకు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని, ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలి' అని జేసీ ధాత్రిరెడ్డి పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship

The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).
Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.



Prizes & Rewards: Financial support for covering key educational expenses. ***Last Date to Apply :*** 30-04-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.
Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.
Prizes & Rewards: An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.
Last Date to Apply: 15-04-2025
Application mode: Online and offline via email at admissions@doon-school.com
Short Url : www.b4s.in/aj/DSSE2

buddy4study.com

ఇంటర్మీడియెట్ తరవాత
ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులు ఇక పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లపై దృష్టిపెట్టి ఉంటారు. ఇప్పటికే జేఈఈ మెయిన్ రెండో సెషన్ కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. దీనితోపాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాసే ఇతర ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు ఇవి.

జేఈఈ మెయిన్ పేపర్-1

ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐ, ఇతర పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: jeemain.nta.nic.in

జేఈఈ అడ్వాన్స్‌డ్:

ఐఐటీల్లోని ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో చేరడానికి దీనికి రాయాలి. అయితే జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఈ ఎంట్రెన్స్ రాయగలరు.
వెబ్‌సైట్: jeeadv.ac.in

బిట్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్

పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయ్‌ల్లో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్స్) క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్ చేయడానికి ఈ సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: bitsadmission.com
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

టీజీ ఎప్‌సెట్

తెలంగాణలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం టీఎస్ 'ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 9(రూ.250/- ఆలస్య రుసుముతో) (ఐదువేల రూపాయల ఆలస్య రుసుముతో 2025 ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ఏపీ ఎప్‌సెట్

ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 'ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 24



విట్టీ

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల అడ్మిషన్స్ కోసం 'విట్టీ' ఎంట్రెన్స్ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 'ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) రాయాల్సి ఉంటుంది. ఈ విట్‌కు పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: viteee.vit.ac.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 7

ఎస్ఆర్ఎమ్ జేఈఈఈ

తమ సంస్థలో అడ్మిషన్ల కోసం ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జాతీయ స్థాయిలో ఎంట్రెన్స్ నిర్వహిస్తుంది. ఎస్ఆర్ఎంకు కూడా పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: srmist.edu.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 16

సెట్టీ

వివిధ రాష్ట్రాల్లో 'సింబయాసిస్' సంస్థకు ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఈ ఎంట్రెన్స్ పరీక్ష రాయాలి.
వెబ్‌సైట్ : www.settest.org/register.html
చివరి తేదీ : 2025 ఏప్రిల్ 12

ఏపీ పీజీసెట్ 2025



ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'(ఏపీ పీజీసెట్ 2025)నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్‌ను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది.

ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కాలేజీల్లో 150కి పైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉంటుంది. యూనివర్సిటీలోని 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయించారు.
ఈ ఎంట్రెన్స్ మూడు కేటగిరీలుగా ఉంటుంది.
కేటగిరీ-1: ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్
కేటగిరీ-2: కామర్స్ అండ్ ఎడ్యుకేషన్
కేటగిరీ-3: సైన్స్ సబ్జెక్టులు
కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ఎంసీజే, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు ఉన్నాయి.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా ఎంట్రెన్స్‌కు హాజరు కావచ్చు.
పరీక్ష విధానం: లాంగ్వేజ్ స్పెషలైజేషన్ తప్ప మిగతా ప్రశ్నపత్రం ఇంగ్లీష్‌లో ఉంటుంది. కంప్యూటర్ ఆధారంగా పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. 90 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు జరుగుతుంది. నెగెటివ్ మార్కులు లేవు.
యూనివర్సిటీలు: ఆంధ్ర యూనివర్సిటీ (విశాఖపట్నం), డా.బీఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి), డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ(కర్నూలు), శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ(అనంతపురం), ద్రవిడియన్ యూనివర్సిటీ(కుప్పం), ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), కృష్ణా యూనివర్సిటీ(మచిలీపట్నం), శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ(రాజమహేంద్రవరం), యోగి వేమన యూనివర్సిటీ(కడప), క్లస్టర్ యూనివర్సిటీ(కర్నూలు), రాయలసీమ యూనివర్సిటీ(కర్నూలు), ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ(ఒంగోలు), విక్రమ సింహపురి యూనివర్సిటీ(నెల్లూరు), జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(అనంతపురం), ఆయిల్ టెక్నలాజికల్ అండ్ ఫార్మాస్యూటికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(తిరుపతి)
చివరి తేదీ: 2025 మే 5 (ఆలస్య రుసుముతో 2025 మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)
ప్రవేశ పరీక్షలు: 2025 జూన్ 6 నుంచి జూన్ 13 వరకు నిర్వహిస్తారు.
వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

టెన్త్ తరవాత డిప్లొమా
లెదర్ టెక్నాలజీతో కెరీర్

- డిప్లొమా ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా చేయవచ్చని అందరికీ తెలిసిందే. అయితే మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు పాలిటెక్నిక్‌లో ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. కొన్ని డిప్లొమాలు చేస్తే కాలేజీ పట్టాతోపాటే ఉద్యోగం వస్తుంది. అందులో లెదర్ టెక్నాలజీ ఒకటి. హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత డిప్లొమా కోర్సులు ఉన్నాయి. దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమాలను ఆఫర్ చేస్తోంది.

సీట్లు : ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. పదో తరగతి పాసైనవారు ఇందులో చేరేందుకు అర్హులు. గరిష్ఠ వయోపరిమితి లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది.

కోర్సు కాలవ్యవధి: ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలో విద్యార్థులు ఇండస్ట్రీ రెడీ విద్యార్థుల తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు రూ.7,000 స్టయిపెండ్‌గా లభిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు: దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి.



ఉన్నత చదువులు

లెదర్ టెక్నాలజీలో డిప్లొమా తరువాత ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/ బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

బీటెక్ అందించే కాలేజీలు

- హర్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



నటనతో అదరగొట్టారు

ఎన్టీఆర్

"అంచనాలను మించి విజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రబృందానికి నా అభినందనలు. ఈ విజయం వెనుక దర్శకుడు కల్యాణ్‌శంకర్ కష్టం చాలా ఉంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన వారంతా తమదైన నటనతో అదరగొట్టారు. కామెడీని పలికించడం కష్టమైన పని. అందుకే నేను 'అదుర్స్ 2' చేయడం లేదు. అప్పట్లోలా ఇప్పుడు నవ్వించలేనేమో అనే భయం ఉంది. కానీ 'మ్యాడ్ స్క్వేర్'లో నార్నె నితిన్ కామెడీని బాగా పండించాడు" అని ఎన్టీఆర్ అన్నారు. ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర విజయోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది. చిత్రబృందానికి ధన్యవాదాలు" అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ "నాగవంశీ లేకుంటే నేను ఉండేవాడ్ని కాదు. నిర్మాత చినబాబు లేకుంటే 'మ్యాడ్' చిత్రం ఉండేది కాదు" అని తెలిపారు.



మోగ్లీ సాహసం

'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అడవిలో హీరో హీరోయిన్లు ఓ చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: రామమారుతి ఎం, సంగీతం: కాలభైరవ.

ప్రేక్షకుల ముందుకు చంద్రేశ్వర




క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'చంద్రేశ్వర'. సురేశ్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా నటించారు. జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆధ్యాత్మిక అంశాలకు వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి, ఈ నెల్లోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

వైజయంతితో వారసుడు



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి శక్తిమంతమైన పోలీస్ పాత్రలో నటించారు. శ్రీకాంత్, సాయిమంజ్రేకర్, సోహైల్ ఖాన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో విజయశాంతి ముందు కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్.. విలన్ గ్యాంగ్ పనిపడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

'రామం'కు శ్రీకారం



శ్రీరామ నవమి సందర్భంగా చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి 'రామం' అనే పాన్ ఇండియా సినిమాకు శ్రీకారం చుట్టారు. 'ది రైజ్ ఆఫ్ అకిరా' అనేది దీని ట్యాగ్‌లైన్. టాలీవుడ్ యంగ్ హీరో కథానాయకుడిగా నటిస్తున్నారు. పలువురు దర్శకుల దగ్గర పనిచేసిన లోకమాన్య ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, మోషన్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఇప్పటి వరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని చెప్పారు.

అనన్య హిందీ చిత్రం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటిని కొత్తతరహాలో తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు టాలీవుడ్ కథానాయిక అనన్య నాగళ్ల. 'మల్లేశం, వకీల్‌సాబ్' తదితర చిత్రాల్లో పాత్రోచిత నటనతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు బాలీవుడ్ అరంగేట్రానికి సిద్ధమయ్యారు అనన్య. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతోన్న హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఏక్తా ఫిలిం ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌లో రూపొందుతోన్న ఈ చిత్రానికి రాకేశ్ జగ్గి దర్శకత్వం వహిస్తున్నారు. హిమ్మత్ లడుమోర్ నిర్మిస్తున్నారు. 'ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఓ గిరిజన యువతి పాత్రలో అనన్య నాగళ్ల కనిపించనున్నారు. ఆమె అభినయం చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

పుడ్తామా యేటి మళ్లీ

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఒకటే పని సేసేనాకి.. ఒకేనాగ బతికేనాకి.. ఇంత పెద్ద బతుకెందుకు.. ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాల.. పుడ్తామా యేటి మళ్లీ' అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్ చరణ్ పలికిన డైలాగులతో మొదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించనున్నారు. ఆయన మాస్ లుక్, ఏఆర్ రెహ్మాన్ సంగీతం, రత్నవేలు విజువల్స్ ప్రధానాకర్షణగా నిలిచాయి. సినిమాను వచ్చే ఏడాది శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు రామ్‌చరణ్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. కాగా, ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.



చేయిపట్టి లాగారు



నటి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ముంబైలో షూటింగ్ పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని బలం ఉపయోగించి తమ గుంపులోకి లాగారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. షూటింగ్ నిమిత్తం చిత్ర బృందం ఇటీవల డార్జిలింగ్ వెళ్లింది. చిత్రీకరణ అనంతరం కార్తిక్ ఆర్యన్‌తో కలసి శ్రీలీల తిరిగి వస్తుండగా వారిని చూసేందుకు స్థానికులు, అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ క్రమంలో వారికి అభివాదం చేసుకుంటూ ఆమె ముందుకు నడిచారు. ఇంతలో బాడీగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్న గుంపులోంచి కొంత మంది ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని లాగారు. దీంతో శ్రీలీల షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది ఆమెను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకెళ్లారు.

సరికొత్త పాత్రలో విక్కీ కౌశల్




'ఛావా'లో శంభాజీ పాత్రలో నటించి మెప్పించిన విక్కీ కౌశల్ ఈసారి ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపించేందుకు సిద్ధమవుతున్నారు. శూజిత్ సిర్కార్ దర్శకత్వంలో 'ఏక్ జాదూగర్' అనే హిందీ చిత్రంలో విక్కీ కౌశల్ మెజీషియన్‌గా నటిస్తున్నారు. రైజింగ్ సన్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆదివారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. మెరుస్తున్న ఆకుపచ్చని దుస్తులతో ఇంద్రజాలికుని వేశంలో ఉన్న విక్కీ కౌశల్ లుక్ అదిరిపోయింది.

కదన రంగంలోకి



నటుడు అర్జున్ సర్జా కీలకపాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతాపయనం'. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతోంది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్న హీరో ధ్రువ సర్జా ఫస్ట్‌లుక్‌ను శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. తీక్షణమైన చూపులతో కదన రంగంలోకి దిగుతున్నట్టు ఆయన కనిపించారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా అర్జున్ కథానాయిక. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: జి. బాలమురుగన్, ఎడిటర్: ఆయూబ్‌ఖాన్

ఓ రామ శ్రీరామ..



బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. థియేటర్లలో ఈనెల 10న విడుదలవుతోంది. శ్రీరామ నవమి సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓ రామా శ్రీరామ..' అనే పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు థమన్ స్వరాలు అందించగా, ధనుంజయ్ ఆలపించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



పెరుగుతున్న అనారోగ్య బాధితులు
బడ్జెట్‌లో పావు వంతు మందులకే
పోటీ పడుతున్న సుగర్, బీపీ వ్యాధులు
ప్రజల్లో అవగాహన పెంచాలి
నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఏలూరు క్రైం/పాలకొల్లు/పోలవరం ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. అందరూ బావుండాలి అందులో మనం ఉండాలి. మనం.. మన చుట్టూ ఉన్న సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఒకప్పుడు శారీరక శ్రమే ఎక్కువగా ఉండేది. నాడు గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఏ చిన్న వస్తువు కావాలన్న కాలినడకనో, సైకిల్ పైనో వెళ్లి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండానే ఇంటికి వచ్చేస్తున్నాయి. శరీరానికి సుఖం అలవాటు చేసేశారు. శారీరక శ్రమ లేకపోవడంతో రక్త ప్రసరణలో మార్పులు లేక తెలియకుండానే చాపకింద నీరులా రోగాల బారినపడిపోతు న్నారు. వయోభేదం లేకుండా ఆరోగ్య సమ స్యలు పౌరులను పరుగులు తీయిస్తున్నాయి. నిత్యం వదలని వ్యాధులు కొన్నయితే పలకరించి పారిపోయే వ్యాధులు అనేకం. నేడు కుటుంబానికో రోగి అనటం అతిశయోక్తి కాదు. మొత్తంగా చెప్పు కుంటే మానవ సమాజం రోగాల పుట్టగా మారు తున్నది. సామాన్య మధ్య తరగతి కుటుం బాలలో నెలబడ్జెట్‌లో పావు వంతు మందులకు ఖర్చు పెడుతు న్నారు. అధిక శాతం కుటుం బాలలో నిత్యా వసరాల జాబితాలో ఔషధాలు చేరాయి. సుగర్, బీపీ వ్యాధులు పరుగులు తీస్తున్నాయి. మరో వైపు క్యాన్సర్ వ్యాధి అనేక మంది ఆరోగ్యాన్ని కబలించి వేస్తున్నది. ప్రజలకు రోగాల పట్ల అవగాహన కల్పించాలి. వైద్యం ఉచితం చేయాలని కోరుతున్నారు.

ప్రతీ ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 1948లోనే తొలిగా ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించినప్పటికీ 1950వ సంవత్సరం ఏప్రిల్ 7న జరుపుతున్నారు. "ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశాజనక భవిష్యత్తు" అనే నినాదంతో ఈ ఏడాది ఆరోగ్య దినోత్సవం నిర్వహించనున్నారు.

ఒక సర్వే ప్రకారం కలుషిత తాగునీటి వల్లనే 60 శాతం రోగాలు వస్తున్నాయని డబ్ల్యు హెచ్‌వో వెల్లడించింది. సాధారణ రోగాలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు మానవ తప్పిదాలు వల్లే సంభ విస్తున్నాయని వైద్య వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. ఇటీవలే రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేస్తున్న పరిస్థితిపై పాలకొల్లు మున్సిపాలిటీకి తాఖీదులు ఇచ్చింది. సంబంధిత అధికారులను వివరణ కోరింది. అయినప్పటికీ వివిధ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తగల బెడుతున్నారు. మంటల నుంచి వెలువడే రసాయనాలు పీల్చడం ద్వారా క్యాన్సర్ వంటి బారిన పడుతున్నారు.

ఏలూరు జిల్లాలో సుమారు 23 లక్షల జనాభా ఉండవచ్చు. జిల్లాలో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏ ఇల్లు చూసిన ఎవరో ఒకరు షుగరు, బీపీ దీర్ఘకాలిక వ్యాధితో కనిపిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం కిడ్నీలకు సంబంధించిన వ్యాధి గ్రస్తులే ఉన్నారు.పక్షవాతంతో ఉన్న వారు కూడా జిల్లాలో ఎక్కువ మందే కనిపి స్తున్నారు. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు ఇటీవల కాలంలో ఎక్కువ పెరిగిపోతు న్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసు పత్రులకు రోజుకు 1000 మంది వరకూ బీపీ, సుగరు వ్యాధి గ్రస్తులు వెళ్ళి వైద్యం చేయించుకుంటు న్నారు.

వ్యాధులకు కారణాలెన్నో..

ఆహార పదార్థాల్లో రంగులు కలపడం, కల్తీ చేయడం, పాలిష్డ్ రైస్ తినడం, జంకుఫుడ్, కల్తీ నూనెలతో తయారుచేసిన వంటకాలు తినడం, కల్తీ పాలు, కల్తీ ఆహార పదార్థాలతో తెలియకుండా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. స్వీట్ షాపుల్లో మితిమీరి కాక నూనె వినియోగిస్తున్నప్పటికీ నిత్యం వేల సంఖ్యలో ఆ పదార్థాలను తిని రోగాలను కొని తెచ్చుకుంటు న్నారు. శారీరక శ్రమ లేకపో వడం, వ్యాయామం, క్రీడలు, యోగా, నృత్యం, వంటివి విద్యార్థి దశలో లేకపోవడంతో వ్యాధులు బారిన పడుతున్నారు.

ఆరోగ్యం కోసం రోజూ ఒక గంట సమయం వ్యాయామం లేదా నడక కోసం కేటాయించాలి. ప్రతి రోజు శారీరక శ్రమ, ఆరోగ్య కరమైన బరువుని క్రమబద్ధీకరించుకోవడం ద్వారా హృదయనాళ వ్యవస్థను బలో పేతం చేసుకుని అనవసర కొవ్వుల వల్ల వచ్చే గుండె సమస్య లను దూరం చేయ వచ్చు. మానసిక ఆరోగ్యా నికి తగినంత నాణ్యమైన నిద్ర చాలా అవ సరం. 7 నుంచి 9 గంటల సేపు నిద్రపోవడం అలవాటుగా చేసుకోవాలి. ఆహారంగా పండ్లు కూర గాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం వల్ల దీర్ఘాయువు పొందగలం.

వ్యాయామంతో ఆరోగ్యం



నవీన యుగంలో ఆహార నియమాలు తప్పక పాటిం చాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన విధంగా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మితంగా ఆహారం తీసుకుని తగినంత పరిశ్రమ చేసిన వారికి ఎటువంటి అనారోగ్యం ఉండదని ఆయుర్వేదం చెబుతుంది. యంత్రాలపై ఆధారప డటం తగ్గించాలి. నడక, వ్యాయామంతో పాటు శాఖాహారం, పండ్లు, మంచినీరు తీసుకోవాలి. మాంసాహారం ఎంత తక్కువ తింటే అంత మంచిది. ప్రతీరోజు కొద్దిసేపు యోగ చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- శ్రీరామ్, ఆయుర్వేద వైద్యుడు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



20 సంవత్సరాలుగా షుగరు, బీపీ ఉన్నాయి. సుగరు, బీపీ ఉన్న వారు తప్పనిసరిగా సమయానికి ఆహారం తీసుకోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. పడని ఆహారాల జోలికి అసలు వెళ్ళకూడదు. క్రమం తప్పకుండా మందులు వాడాలి. ప్రతీ రోజు కనీసం అరగంట సేపు వ్యాయామం లేక యోగా, వాకింగ్ చేయాలి. ప్రతీ గంటకు ఒక గ్లాసు నీరు తాగితే చాలా మంచిది. రోజుకు కనీసం 8 గంటలైనా నిద్ర పోవాలి. మానసిక ఒత్తిడి లేకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటే చాలా మంచిది.

-టీవీ రామకృష్ణ ,ఎంఈవో-2, పెంటపాడు



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణ అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



గురుకులానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురు కుల పాఠశాల తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. స్కౌట్‌లో పాఠశాల నుంచి 18 యూనిట్‌లుగా 450 మంది చేరడం ద్వారా ఈ రికార్డు సొంతం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. ఒకే స్కూల్ నుంచి విద్యార్థులంతా స్కౌట్స్‌లో చేరడం ఒక రికార్డుగా గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ స్టేట్ అబ్జర్వర్ సిరిమువ్వ శ్రీనివాస్ ఈ రికార్డ్ ను అందించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ పశ్చిమ గోదావరి జిల్లా సెక్రటరీ ఉంగరాల నాగేశ్వరరావు ఈ రికార్డ్ అందుకున్నారు. సీనియర్ స్కౌట్ ఆఫీసర్ బ్రహ్మేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బంగారం ప్రతాప్ పాల్గొన్నారు.



యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సుధాబత్తుల కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో విశాఖపట్నం నుంచి వచ్చిన పుండరీ కాక్షయ్య, ధరణిధర్‌లు రాష్ట్ర శాఖ తరుపున ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. గౌర వాధ్యక్షుడిగా డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, అధ్యక్షుడిగా మంతెన వెంకట నరసింహ సీతారామరాజు (చిలుకూరి నరసింహ రాజు), ఉపాధ్యక్షుడిగా బోనం పాండు రంగారావు, సరిపడకల రామారావు, చైర్మన్‌గా ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీఖాకొల్లు హనుమంతరావు, కార్యదర్శిగా, కటికరెడ్డి వెంకటరత్నంలను ఎన్నుకున్నారు. యూనిట్ పూర్వాధ్యక్షుడిగా మల్లినీడి తిరుమల రావు (బాబి), యూనిట్ కన్వీనర్‌గా గన్నాబత్తుల శ్రీనివాస్ కొనసాగుతారు. కార్యవర్గ సభ్యులుగా 11 మందిని మహాజన సభ్యులు ఎన్నుకున్నారు.



రామచంద్రాపురంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు.. గుబ్బలమంగమ్మ గుడికి వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన చేతి పంపు వద్ద నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

గిరిజన గ్రామాల్లో దాహం కేకలు

జీలుగుమిల్లి, ఏప్రిల్: 6 (ఆంధ్రజ్యోతి) : వేసవి రాకముందే తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటు న్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు బిన్నంగా కన్పిస్తుంది. మూరుమూల గిరిజన గ్రామం రామచంద్రాపురం (గుబ్బల మంగమ్మ గుడి సమీపం)లో ఆంధ్ర తెలంగాణకు సరిహద్దులో ఉన్న గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరు తున్నారు. వారం రోజులుగా గ్రామంలో కనీస అవసరాలకు నీటి సరఫరా లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది సమస్య పరిష్కరించడంలో విఫలం అవుతున్నారు. గ్రామంలో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు పూర్తిగా పాడై శిథిలావస్థలో ఉంది. ట్యాంకు బయటి అంచులు పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. కొంతకాలంగా విద్యుత్ సరఫరా ఉన్న సమ యంలో మాత్రమే గ్రామస్థులు ట్యాంకు వద్ద పంచాయితీ మోటరు వేసి మంచినీరు పట్టుకుం టున్నారు. ప్రస్తుతం ఆ మోటారు పనిచేయడం లేదని చెబుతు న్నారు. సమీపంలోని గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే భక్తుల కోసం రోడ్డ పక్కన వేసిన చేతి పంపే గ్రామస్థులకు దిక్కయ్యింది. పంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు నిలదీయడంతో పంచాయితీ బోరు వద్ద ఉన్న మోటరు స్టార్టర్ పెట్టెను సైతం తీసేశారని గ్రామ మహిళలు చెబుతున్నారు.



శిథిలమైన మంచినీటి ట్యాంకు వద్ద పెచ్చులు ఊడిన దృశ్యం



మాట్లాడుతున్న ప్రవచనకర్త గరికిపాటి గురజాడ అవధాని

ప్రజల్లో భక్తితో పాటు పర్యావరణంపై అవగాహన అవసరం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నేడు ప్రజల్లో భక్తి భావం పెరుగుతోంది.. దానికి తగ్గట్టుగా పర్యావరణపై అవగాహన కలగాలని ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహా రావు కుమారుడు అవధాని గరికిపాటి గురజాడ అన్నారు. పాలకొల్లు అచ్చుగట్ల పాలెంలోని ముఖదారమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గురజాడ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. గురజాడ అవధాని మాట్లాడుతూ జలకాలుష్యం, వాయు కాలుష్యం అరికట్టకుంటే జీవ మనుగడకు ఇబ్బందులు తలెత్తుతా యన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం, నీటి కాలుష్యం లేకుండా ఉండటానికి ప్రయత్నించాలన్నారు. అనం తరం ఆలయం వద్ద శ్రీతిరుమలవాస భజన మండలి, శ్రీ అమర్‌నాథ్ భజన మండలి, అంజానాద్రివాస భజన మండళ్ళ ఆధ్వర్యంలో పులవర్తి ధనలక్ష్మీ పర్యవేక్షణలో మహిళలతో కోలాటం నిర్వహించారు.

పేదలకు వైద్యం మరింత చేరువ : జోగయ్య

పాలకొల్లు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని వంద నుంచి 300 పడకల సామర్థ్యంతో పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామ జోగయ్య హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేయడం పేద ప్రజలకు వరమన్నారు. 175 నియోజక వర్గాలకు గాను వంద పడకల పైగా ఆసుపత్రులు ఇప్పటికే 70 ఉన్నాయనీ మిగిలిన 105 నియోజకవర్గాలలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణం జరిగేలా వేగంగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించడం ద్వారా రాష్ట్రంలో పేద వర్గాలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయన్నారు. పాలకొల్లు ఏరియా ఆసుపత్రిలో ఇప్పటికే మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కృషితో డయాలిసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఇక్కడ మల్టీ స్పెసాలిటీ సేవలు అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలే కాకుండా గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలందరికీ వైద్యం మరింత చేరువవుతుందన్నారు.



రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

చెరువులో పడి కూలీ మృతి

ఆకివీడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి చెరువులో పడి కూలీ మృతి చెందాడు. ఆకివీడు వార పుసంత (సంతమార్కెట్)లోని ఇల్లాపు వీధికి చెందిన పోతురాజుల శ్రీనువాసు (51) వివిధ రకాల పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఆకివీడు భుజబలరాయుడు మంచినీటి చెరువులో మృతదేహం కనిపించడంతో వాటర్ వర్క్సు సంబంధించిన వ్యక్తి బయటకు తీశాడు. విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు వచ్చి మృతుదేహాన్ని తీసుకెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల అనా రోగ్యంతో బాధపడుతున్నట్టు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెంటపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. పెంటపాడు గ్రామానికి చెందని సత్తి సూర్యచంద్రారెడ్డి (69) మోటర్‌సైకిల్‌పై శనివారం పని నిమిత్తం గణపవరం మండలం పిప్పర గ్రామానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం పెంటపాడు వస్తుండంగా పెంటపాడు సమీపంలో తాడేపల్లిగూడెం నుండి భీమవరం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఇతడిని 108పై బంధువులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూర్య చంద్రారెడ్డి ఆదివారం మృతి చెందాడని, మృతుని కుమారుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాజేంద్ర తెలిపారు.

క్రైమ్ కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వేగవరం వద్ద బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి తోట లక్ష్మీ నారాయణ (42) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీ.నర్సాపురం మండలం తిరుమలదేవిపేటకు చెందిన తోట లక్ష్మీ నారాయణ (42) తన ఇద్దరు పిల్లల చదువుల నిమిత్తం జంగా రెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం అశ్వారావుపేట రోడ్డు వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతని వాహనాన్ని ఢీ కొట్టి వెళ్లి పోయింది. లక్ష్మీనా రాయణకు తీవ్ర గాయాలై ఘటనా స్థలం వద్దనే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య గొడవ

పరస్పర దాడులు.. కేసు నమోదు

టీ.నర్సాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అప్పల రాజుగూడెంలో రెండు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో పరస్పర కేసులు నమోదయ్యాయి. అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన ఇనుకుల బలరామకృష్ణ, కోలా లక్ష్మీకాంతం కుటుంబాల మధ్య పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 4వ తేదీన బలరామకృష్ణ, అతని భార్యలను కోలా లక్ష్మీకాంతం, ఆమె కుటుంబ సభ్యులు కలిసి కొట్టారు. గాయపడిన బాధితులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం పట్ల ఇనుకుల బలరామకృష్ణ అసభ్యంగా ప్రవర్తించి అతని భార్యతో కలిసి ఆమెను కొట్టి గాయపరిచారని లక్ష్మీకాంతం ఇచ్చిన ఫిర్యాదుతో ఆదివారం ఇరువర్గాల మధ్య పరస్పర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు.



తిరువీధుల్లో ఊరేగిన చిన వెంకన్న

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : సీతారామ చంద్రస్వామి లక్ష్మణ, హనుమాన్ సమేతంగా ఆదివారం ఉదయం ద్వారకాతిరుమల క్షేత్ర తిరు వీధుల్లో ఊరేగారు. ఇలా ఏడాదికోసారి మాత్రమే క్షేత్ర పురవీధుల్లో స్వామి వార్ల ఊరేగింపు ఉంటుంది. ఆలయ ఆవరణలోని తిరుచ్చి వాహనంపై సీతా రామ, లక్ష్మణ, హనుమాన్ ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం అట్టహాసంగా కోవెల ఆవరణ నుంచి ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధుల్లో ఊరేగించారు.


సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న దృశ్యం

రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు : పూళ్ల, ఎం.ఎం.పురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. పూళ్ల నుంచి సాయన్న పాలెం, తోకలపల్లిలో నిర్మించిన బ్రిడ్జి రోడ్డు, పూళ్లలో 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పవన్ కుమార్, బీజేపీ నాయకులు పుప్పాల హరీశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : భీమడోలు సెక్షన్ పూళ్ళ సబ్ స్టేషన్ పరిధిలో మొక్కలు తొలగించే కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు పూళ్ళ, ఎం.ఎం.పురం, కురెళ్లగూడెం, దుద్దేపూడిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్లకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. విద్యుత్ అంతరాయాన్ని పురస్కరించుకుని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండ్రాజవరంలో 230 మందికి ఉచిత వైద్యం

దెందులూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించాలనే ఆలోచనతోనే ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు నిర్వాహకులు రామేణ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దెందులూరు మండలం పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామంలో శ్రీనివాస మెడికల్స్ ఆధ్వర్యంలో లైఫ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ డి.హరికిషన్, గైనకాలజిస్టు గీతిక, పలువురు వైద్యులు సేవలందించగా ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జరజాపు రంగారావు, టీడీపీ నాయకులు బాయి రాంప్రసాద్, ఎంపీటీసీ నరేశ్‌లు ప్రారంభించారు. ఉండ్రాజవరంతో పాటుగా శివారు గ్రామాల రోగులకు 230 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జరజాపు శ్రీనివాసరావుతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

29న రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏలూరు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి కె.విశ్వేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏలూరు జిల్లా శాఖకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందని, ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ శాఖలో సభ్యత్వం కలిగిన పెట్రాన్, వైస్ పెట్రాన్ లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ సభ్యులు హాజరు కావాలన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లిన శ్రీవారి ధర్మ ప్రచార రథం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధర్మ ప్రచారరథం ఆదివారం రాజమహేంద్రవరం వెళ్లింది. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఈ రథంలో కొలువైన స్వామి వారు అక్కడి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ జంటగోపురాల వద్ద ఉంచిన ప్రచార రథాన్ని ఆలయ ఏఈఓ పి.నటరాజారావు ఉదయం ప్రారంభించారు. అనంతరం మేళతాళాల నడుమ రథాన్ని రాజమహేంద్రవరం సాగనంపారు.

నూకాలమ్మ సన్నిధిలో ఘనంగా అన్న ప్రసాద వితరణ



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట గ్రామదేవత నూకాలమ్మ ఆలయంలో జాతర ముగిసిన సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనాకుమారి పాల్గొని ప్రారంభించారు. తొలుత నూకాలమ్మను ఆలయ ప్రధానార్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శాస్త్రి భక్తులతో పూజలు చేయించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ దావాల రంగా సత్యనారాయణ, ఈవో మీసాల వెంకట్రావులు ప్రతినిధులను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.


ప్రాజెక్టును సందర్శించిన విద్యార్థులు, అధ్యాపక బృందం

పోలవరం సందర్శించిన ఇంజనీరింగ్ విద్యార్థులు

పెదపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక సందర్శనలో భాగంగా రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆదివారం పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో ప్రాజెక్టు గురించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విప్రశాంత్, ఏఈఈ జగదీశ్ కాశీబాబులు వివరించారు. ప్రాజెక్టును పరిశీలించి విద్యార్థులు అవగాహన పెంచుకున్నట్టు కళాశాల ఎం.డి. సాయిరోహిత్ చెప్పారు. కార్యక్రమంలో సివిల్ హెచ్‌వోడీ డాక్టరు కె.సుందర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఆరోగ్యం కోసమే ఫిట్ ఇండియా


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరురూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సమాజం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కి, ర్యాలీలు పాల్గొన్నారు. సైకిల్ వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యాన్ని తెలియజేసేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాతబస్టాండ్ మీదుగా పురవీధుల్లో ఈ ర్యాలీ సాగింది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సాయ్ సెంటర్ ఇన్‌చార్జ్ వినాయక్ ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం.రమేశ్ బాబు పాల్గొన్నారు.

10న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 10వ తేదీన తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సభ్యులు వెజ్జు దుర్గాప్రసాద్, వెజ్జు సాయికృష్ణ తెలిపారు. పరీక్షలు చేసిన 15 రోజుల తర్వాత సెల్‌ఫోన్ నెంబర్లకు వివరాలు పంపనున్నట్టు తెలిపారు. అలాగే ముంజులూరు పరిసర గ్రామాల్లోని 225 మంది అంగనవాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, పలకలను ఇవ్వనున్నట్టు తెలిపారు.

టీడీపీ నూతన సభ్యత్వ కార్డుల పంపిణీ


సభ్యత్వం కార్డులు అందజేసిన రత్నాజీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులను పంపిణీ చేస్తున్నట్టు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ తెలిపారు. వైష్ణవి హోటల్ వద్ద ఆదివారం సాయంత్రం సభ్యత్వ కార్డులను పలువురికి అందజేశారు. ద్వారకాతిరుమల మండల వ్యాప్తంగా సుమారు 17వేల నూతన సభ్యత్వ కార్డులు అందజేసినట్టు తెలిపారు. సభ్యత్వం తీసుకున్న అందరికీ ప్రమాద బీమాను అధినేత రూ. 2లక్షల నుంచి రూ.5 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్డులను రత్నాజీ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, బీసీ నేతలు కూరాకుల బుజ్జి, మటపర్తి బద్రి, నేత గువ్వల మావుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు సత్కారం


పెద్దిరాజును సన్మానిస్తున్న దృశ్యం

ఉంగుటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శిరిమామిళ్ల పెద్దిరాజుకు గురుజ్యోతి పురస్కారం అందజేశారు. విజయవాడ అలంకార్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో విశాఖకు చెందిన ఆణిముత్యం ప్రతిభా సాంస్కృతిక సేవా సంస్థ, గ్లోబల్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. 2025 సంవత్సరానికి సంబంధించి విద్యారంగంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కిందని పెద్దిరాజు తెలిపారు.

●ఏలూరు అర్బన్ : ఏలూరు రూరల్ మండలం ఇందిరా కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.కృష్ణకు విశాఖకు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ గురుజ్యోతి పురస్కారాన్ని అందజేసింది. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణకు ఈ పురస్కారాన్ని అందజేశారు. అవార్డు గ్రహీతను ఏపీటీఎఫ్ నాయకులు రత్నంబాబు, మోహన్‌రావు అభినందించారు.


అంబికా ఆలయంలో పాల్గొన్న అంబికా ప్రసాద్, తదితరులు


రామచంద్రాపురంలోని ఆలయంలో పూజలు


కుక్కునూరులో స్వామికి తలంబ్రాల అందజేత

కన్నుల పండువగా

వాడవాడలా రాములోరి కల్యాణోత్సవం


నారాయణపురం స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలంలోని శ్రీపర్రులో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, గురుకులపేటలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ గండికోట నాగరాజు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఏడిద కిశోర్ శాస్త్రి కల్యాణం జరిపించగా ఎస్.శ్రీనివాస్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. చాటపర్రులోని అంజనేయస్వామి ఆలయంలో గుత్తా పిచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎంపీ మాగంటి బాబు, జయ భేరి ఆర్గ్ అధినేత మురళీ మోహన్ పాల్గొని తిలకించారు. అమీనాపేటలోని విద్యుత్ రామాలయంలో నిర్వహించిన నవమి వేడుకల్లో ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.సాల్మన్ రాజు, ఆలపాటి రఘునాథబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు కె.ఎం.అంబేద్కర్, టి.శశిధర్, ఏడీఈలు ఎల్.వి.శ్రీనివాస్, కె.గోపాలకృష్ణ, బికృష్ణరాజు, నాయకులు తురగా రామకృష్ణ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్ : తూర్పువీధి చాటపర్రు రోడ్డులో దాసాంజనేయస్వామి గుడివద్ద జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. 40వ డివిజన్ ఏటిగట్టు శ్రీరామాలయం వద్ద, భక్తంజనేయు ఫిష్ ఎక్స్‌పోర్ట్స్ ఆధ్వర్యంలో న్యూఫిష్ మార్కెట్ వద్ద జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో చంటి దంపతులు పాల్గొన్నారు. ఆర్‌ఆర్.పేట కోదండ రామాలయంలో ఎమ్మెల్యే దంపతులు, చంటి, మీనాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంకొండ శ్రీలక్ష్మి, ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, త్రిపర్ణరాజేశ్, ఆలయ కమిటీ అధ్యక్షులు చెంచయ్య పాల్గొన్నారు. కొత్తపేట నూకాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే చంటి, మీనా దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ దావాలరంగా, సభ్యులతో జాతరను ప్రారంభించారు. కమిటీ సభ్యులు జంపా సూర్యనారాయణ, ఎస్.చిరంజీవి, త్రిపర్ణరాజు, యు.సురేశ్, లంకా నాగేశ్వరరావు, కోలా సురేశ్, కరణం రాజు, వెల్లంకి రాజు, సర్వేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : చెరువువీధిలో చాత్తాద శ్రీవైష్ణవ శ్రీరామానుజన్ శ్రీరామ మందిరంలో శ్రీరామచంద్రునికి సీతమ్మవారికి పరిణయ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలు కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపారు.

● టి.నర్సాపురం : టి.నర్సాపురం పంచాయతీలోని చిన్నరామాలయం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం శ్రీసీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు మండం ఆదిత్యకుమార్ దంపతులు పట్టువస్త్రాలు, మంగళసూత్రాలు, తలంబ్రాలు సమర్పించగా జనసేన పార్టీ మండలాధ్యక్షులు అడపా నాగరాజు అన్నదానం ప్రారంభించారు. తెడ్లం గ్రామంలో సర్పంచ్ ముప్పన స్రవంతి, రమేశ్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణోత్సవం నిర్వహించారు. మండం ఆదిత్యకుమార్, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి,వీరారెడ్డి, బండి శ్రీను, చింత రత్నారెడ్డి, పొరప్రోలు రవీంద్రారెడ్డి, బీరం రవి, నల్లూరి శ్రీనివాస్, రామకృష్ణం, భూపతుల రామారావు, శ్యామకూరి రామారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

● పెదవేగి : దుగ్గిరాల శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కల్యాణ వేడుకలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని పానకం తయారు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ శ్రీరామనవమి ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు, సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.

●ఉంగుటూరు : స్థానిక కమ్మ రామాలయం, నారాయణపురం కోదండ రామాలయాల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టి.డి.పి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, సూరత్తుల అయ్యప్పలను సత్కరించారు.ఈ కార్యక్రమాలలో సర్పంచులు బండారు సింధు మధు, దిడ్ల అలకనంద, చోడే రాజేశ్, కడియాల రవి శంకర్ చోడే శ్రీనివాసరావు, కొండ్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పరిమి మాధవ, ముళ్ళపూడి కృష్ణ కుమార్, మాజీ సర్పంచి అక్కిన నాగమణి పాల్గొన్నారు. కైకరం శ్రీసుందర సీతారామాలయంలో విద్యార్థులు, మహిళలకు వేర్వేరుగా శ్రీరామ లేఖనం పోటీలు నిర్వహించారు.

● భీమడోలు : భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి గ్రామాల్లో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి రూపక దేవాలయంలో, గుండుగొలనులో సీతారామ స్వామి ఆలయంలో కల్యాణం అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. 8వ తేదీ వరకు పంచాహ్నిక దీక్ష జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

● పోలవరం :మండల కేంద్రంలోని నూతనగూడెం, కృష్ణారావుపేట రామాలయాల వద్ద, పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ, ప్రగడపల్లి, ఇటుకల కోట, చేగొండ పల్లి, కొత్తరామయ్యపేట, కొండ్రుకోట, చేగొండపల్లి, ఎల్.ఎండీపేట గ్రామాల్లో నవమి వేడుకలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించగా సామాజిక సమరసత జిల్లా ప్రముఖ్ బొర్రా శ్రీరామ్మూర్తి, ధర్మప్రచార్ మూలెం వెంకన్న, జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని పాల్గొన్నారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడిపూడి, గూటాల, పట్టిసీమ, నూతనగూడెం, దేవరగొంది, గ్రామాల్లో రామాలయాలకు బెల్లం, మిరియాలు ప్రసాద సామగ్రి తపనా ఫౌండేషన్ ప్రతినిధి మల్లిపూడి రాజేశ్ అందజేశారు.

● కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని 9వ వార్డు రామాలయం వద్ద నవమి వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నసమారాధన నిర్వహించారు. తూర్పుపేటలోని రామాలయం వద్ద నవమి వేడుకల అనంతరం దాత మట్టా సత్తిపండు రూ.2 లక్షలతో నిర్మించిన మండపాన్ని ప్రారంభించారు. వాటర్‌ట్యాంకు, పరింపూడి, కన్నాపురం, దిప్పకాయలపాడు, పొంగుటూరు, కన్నాయిగూడెం, బయ్యన్నగూడెం, యర్రంపేట, రాజవరం గ్రామాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

● లింగపాలెం : ధర్మాజీగూడెంలో నిర్వహించిన నవమి వేడుకల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొని స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

● పెదవేగి:రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో సతీశ్ కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

● కామవరపుకోట : మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మద్దిపోటివారిగూడెంలో మాజీ ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. తడికలపూడి, కళ్ళచెరువు, కె.ఎస్.రామవరం, జీలకర్రగూడెం, రావికంపాడు, గొల్లగూడెం, నారాయణపురం, రామన్నపాలెం, ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు.

● చింతలపూడి : చింతలపూడి పట్టణం, మండలంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మారుతీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పట్టు వస్త్రాలను సమర్పించారు. కోదండ రామాలయం, పాత బస్టాండ్ రామాలయం, ఎర్రగుంటపల్లి సమీపంలోని రామునిగట్టు వద్ద ఆలయంలో జరిగిన కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రామునిగట్టు వద్ద కల్యాణోత్సవాలు భారీగా జరిపారు. ఎర్రగుంటపల్లి - మక్కినవారిగూడెం మధ్యలో అడవిలో గట్టుపై ఉన్న ఈ ఆలయానికి సరిహద్దు తెలంగాణ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

●పెదపాడు : పెదపాడు, రామచంద్రపురం, అప్పనవీడు, నాయుడుగూడెం, తోటగూడెం, పునుకొల్లు గ్రామాలతో పాటుగా అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద సీతారాముల కల్యాణ ఘట్టాలను వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ, మంగళవాయిద్యాల నడుమ జరుగ్గా భక్తులు వీక్షించి సీతారాముల విగ్రహాలపై తలంబ్రాలు పోశారు. రామచంద్రపురం రామాలయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

● నిడమర్రు : మండలంలో పత్తేపురం, పెదనిండ్రకొలను, నిడమర్రు, భువనపల్లి, అడవికొలను, ఛానమిల్లి గ్రామాల్లో ఉన్న శ్రీరామాలయంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అడవికొలనులో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సోమవారం గ్రామనడి వీధిలో రథోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోటిపల్లి రాధాకృష్ణ తెలియజేశారు.

● బుట్టాయగూడెం : మండలంలో ఎంతో ప్రసిద్ధి చెందిన గుబ్బల మంగమ్మ ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మండల వ్యాప్తంగా రామాలయాల్లో నవమి వేడుకలను పురస్కరించుకుని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

● జీలుగుమిల్లి : స్థానిక శ్రీకోదండ రామాలయంలో అర్చకులు టి.ఎస్.రామకృష్ణశర్మ మాతంశెట్టి కిశోర్, బొలగాని శివ దంపతులచే శ్రీసీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. వంకవారిగూడెం, పాతచీమలవారిగూడెం, రామన్నపాలెం, తాటియాకులగూడెం, రాచన్నగూడెం ములగలంపల్లి, దర్భగూడెం, లక్ష్మీపురం వంటి గిరిజన గ్రామాల్లో నవమి వేడుకలు నిర్వహించారు. రామన్నపాలెంలో నవమి వేడుకలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాముల ప్రసాద్, నేలటూరి సత్యం, గెడ్డం వీరబాబు, కోరం చెన్నకేశవులు ఉన్నారు.

●వేలేరుపాడు : మండలంలోని శివకాశీపురం, యర్రబోరు కోదండ రామాలయాల్లో, రుద్రమ్మకోటలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో, భూదేవిపేట, మేడేపల్లి, జగన్నాధపురం, సుద్దగుంపు, తదితర గ్రామాల్లో కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

●కుక్కునూరు : మండలం మిట్టగూడెంలో నవమి వేడుకలను పురస్కరించుకుని ముబారక్ అనే యువకుడు మతసమరస్యం పాటిస్తూ సీతారాములకు పట్టువస్త్రాలు అందజేశారు. ప్రతీ ఏటా సీతారాముల కల్యాణంలో పాల్గొని ఆలయాల అభివృద్ధికి తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నాడు. అలాగే మండల వ్యాప్తంగా ఆలయాల్లో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అమీనాపేటలో సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవాల్లో ఎస్పీ, జేసీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీ సంప్రదాయాలను రేపటి తరాలకు అందజేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ అన్నారు. ఏలూరు అమీనాపేటలోని పోలీస్ శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కిశోర్ ఆయన సతీమణి జేసీ ధాత్రిరెడ్డి కల్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు ఏఆర్‌డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్, కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న తపనా చౌదరి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్ అధ్యక్షతన ఉప్పలమెట్టలోని గంటా అనూరాధ ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి బీజేపీ జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపకులు,సిద్ధాంత కర్తలు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అర్జుల మురళీ,మల్లాది సీతారామారావు, కొప్పాక శ్రీనివాసరావు,వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

●భీమడోలు : భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలులో సంతమార్కెట్ వద్ద ఉన్న పార్టీ స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. గుండుగొలనులో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, శరణాల మాలతీరాణి, రఘువంశీ, వెజ్జు ధర్మారావు, మూర్తి, ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

●ఏలూరు రూరల్ : అభివృద్ధి చెందిన దేశాల తరఫున భారత్‌ను నిలిపిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి(తపనా చౌదరి) అన్నారు. ఆదివారం ఏలూరులోని బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.విక్రమ్ కిశోర్ అధ్యక్షతన 46వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్నేని కృష్ణప్రసాద్, గాది రాంబాబు, జి.చైతన్య పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాతే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని బీజేపీ మండలాధ్యక్షుడు దామిశెట్టి సాయి విశ్వనాథ్ అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు మారేంపాటి హరిబాబు, దామిశెట్టి కేశవరావు, సాదు ప్రసాద్, పెనుగొండ రామలింగేశ్వరరావు, శ్యామ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు : భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, తపనా సంస్థల ఛైర్మన్ గారపాటి సీతారామంజనేయ చౌదరి అన్నారు. ఆదివారం నియోజకవర్గం దెందులూరులో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, మండూరి బుజ్జీ గోపాల్ ఉన్నారు.

● ఉంగుటూరు :ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, కైకరంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు దీన్ దయాళ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణపురంలోని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో జరిగిన జెండాను ఆవిష్కరించగా కూటమి నాయకులు గన్ని వీరాంజనేయులు, అడపా శోభారాణి, కడియాల ప్రేం సాయి, ఎస్.సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షులు వంజరపు దుర్గారావు పాల్గొన్నారు.

●లింగపాలెం : బీజేపీ ఆవిర్భావ వేడుకలు మండల అధ్యక్షుడు పరసా కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం మండల నాయకులతో కలిసి పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ వరప్రసాద్, చిన్నం సతీశ్ కుమార్, ఎస్.వి.నాగేశ్వరరావు, సాయి, ప్రవీణ్, కొత్తూరి పుల్లయ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

ఆరుగురిపై కేసులు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం వచ్చిన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించి నగరంలో బహి రంగంగా మద్యం తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. బెల్టు షాపులపై దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి 12 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది, ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారని ఏలూరు ఎక్సైజ్ సీఐ కృష్ణధనరాజ్ తెలిపారు.


5కే రన్ ప్రారంభిస్తున్న హనుమంతరావు

ఆరోగ్య పరిరక్షణకే ఆశ్రం 5కే రన్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : నడకతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఆశ్రం ఆసుపత్రి సీఈవో హనుమంతరావు అన్నారు. ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 5కే రన్ నిర్వహించారు. ఈ మేరకు హనుమంతరావు మాట్లాడుతూ నేటితరం ఒత్తిడిని ఎదుర్కొంటోందని, నడక ద్వారా సమస్యను జయించవచ్చన్నారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల రాజు మాట్లాడుతూ గర్భిణులకు, నవజాత శిశువుల ఆరోగ్యం, వారి భవిష్యత్తుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రం మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

భూ సమస్యలపై సత్వర పరిష్కారం

బత్తుల సుమతి, తహసీల్దార్, దెందులూరు



● **దెందులూరు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారా?**

జవాబు : మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. భూ సమస్యలపై 614 వినతులు వచ్చాయి. ఈ అర్జీలతో పాటు గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు సైతం పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాం.

● **భూ రీ సర్వే పరిస్థితి ఏమిటి?**

జవాబు : గత ప్రభుత్వంలో దెందులూరు మండలంలో 13 గ్రామాల్లో భూ రీసర్వే చేపట్టాం. రెండవ విడత భూ రీ సర్వే ప్రస్తుతం మలకచర్ల, ముప్పవరంలో చేపట్టాం. మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే చేపట్టాల్సి ఉంది. త్వరలో పూర్తి చేస్తాం.

● **పోలవరం కాల్వ గట్టు మాయం కాకుండా చేపట్టిన చర్యలేంటి?**

జవాబు : జిల్లా అధికారులు, ఎమ్మెల్యే ఆదేశాలతో పోలవరం కాల్వ గట్టు గ్రావెల్ అనుమతులు లేకుండా తవ్వే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేయించి వాహనాలు సీజ్ చేయిస్తున్నాం. గ్రామాల్లో చెరువు మట్టి తరలించాలన్నా మైనింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి.

- దెందులూరు,(ఆంధ్రజ్యోతి)

పాడి గేదె, దూడ మృతి

టి.నర్సాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : తెడ్లం గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడి పాడి గేదె, దూడ మృతి చెందాయి. చవల సోమయ్యకు చెందిన తోటలో విద్యుత్ వైరు తెగి పిన్నిబోయిన దుర్గయ్యకు చెందిన పాడి గేదె, దూడ మృతి చెందాయి. వాటి విలువ సుమారు లక్ష రూపాయలని రైతు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బండి శ్రీనివాసరావు, కేతిరెడ్డి వీరారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

విద్యుత్‌ను పునరుద్ధరిస్తాం

చింతలపూడి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో శనివారం వీచిన గాలి,వానకు పలు చోట్ల చెట్లు కూలిపోగా విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాత్రి ఒంటి గంట వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యుత్ శాఖాధికారులు, కార్యకర్తలు రోడ్లపై చెట్లు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఆదివారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. దీనిపై విద్యుత్ శాఖ ఏడీ రాంబాబు నాయక్ మాట్లాడుతూ విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని, ఆదివారం రాత్రికి పూర్తిస్థాయిలో సరఫరా చేస్తామని తెలిపారు.

కొత్తూరులో చలివేంద్రం

కామవరపుకోట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : కొత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య నాయకులు కాకి గోపాలరావు, మిత్ర బృందం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మొదటి రోజు మజ్జిగను పంపిణీ చేశారు.వేసవి తాపం తగ్గే వరకు ఈ చలివేంద్రంలో మంచినీటి సరఫరా చేస్తామని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.

కోడి పందేలపై దాడి

లింగపాలెం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహిస్తున్న రెండు గ్రామాల్లో దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ధర్మాజీగూడెం ఎస్.ఐ. కె.వెంకన్న తెలిపారు. తిమ్మక్కపాలెంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఐదుగురితో పాటు రూ.2,550 నగదు, కోడి, కత్తి స్వాధీనం చేసుకున్నామని, అలాగే పుప్పాలవారిగూడెంలో ఆరుగురిని అరెస్టు చేసి రూ.2,850 నగదు కోడి, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నిడమర్రు ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నిడమర్రు ఎస్.ఐ. వీర ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం అడవి కొలనులో కేతా వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఒక ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి 20బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

పోలవరం/కొయ్యలగూడెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో వడగండ్ల వాన కురిసింది. పోలవరం, కన్నాపురం రోడ్డులో చెట్లు కూలి రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. తహసీల్దారు సాయిరాజు ఆధ్వర్యంలో చెట్లను నరికించి తొలగించారు. పోలవరం మెయిన్ బజారులో ఈదురు గాలులకు ఫ్లెక్సీలు, బోర్డులు ఎగిరి పడ్డాయి. కొయ్యలగూడెం మండలంలో కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో మర్చి, పొగాకు పంటలు తడిసిపోయాయి.


పోలవరం సెంటర్‌లో కురుస్తున్న వర్షం



యనమదుర్రు ఊర చెరువు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర మలుపు
బత్తులవారిగూడెం గ్రామం వద్ద చెరువు పక్కనే ఉన్న ప్రమాదకర మలుపు

మలుపులు ప్రమాదకరం

వేగ నియంత్రణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న ప్రధాన రహదారులపై గల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. నూజివీడు మైలవరం ప్రధాన రహదారిపై గల ఎనమదల బత్తులవారిగూడెంతో పాటు నూజివీడు రెడ్డిగూడెం ప్రధాన రహదారిపై సిద్ధార్థనగర్ రహదారిపైన సైతం ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దాదాపు మూడేళ్ల క్రితం ఆయా గ్రామాల పరిధిలోని మూల మలుపులు వద్ద రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ప్రమాదకర సూచిక బోర్డులను ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. మరోవైపు ఎనమదల గ్రామం వద్ద గల ఊరచెరువు పక్కనే రెండు ప్రమాదకర మలుపులు ఉండగా ఇటు బత్తులవారిగూడెం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే మూడు చెరువులు ఉన్నాయి. వాహనం అదుపు తప్పితే నేరుగా చెరువులోకి వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై వేగ నియంత్రణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

ముదినేపల్లి-గుడ్లవల్లేరు రోడ్డుకు రూ.2.50 కోట్లు మంజూరు

ముదినేపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడ్లవల్లేరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న ఈ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు 13 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ ప్రధాన రహదారిని ఇటీవల కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కృషి వల్ల ముదినేపల్లి నుంచి మూడు కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేయగా, ఇప్పుడు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషితో తాజాగా రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు అభివృద్ధి వల్ల ముదినే పల్లి ప్రాంత ప్రజలకు గుడ్లవల్లేరు, పెడన, మచిలీపట్నం వెళ్లేందుకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది.



ముదినేపల్లి - గుడ్లవల్లేరు ఆర్అండ్‌బీ రోడ్డు

ఆరోగ్యమే మహాభాగ్యం



- పెరుగుతున్న అనారోగ్య బాధితులు
- బడ్జెట్‌లో పావు వంతు మందులకే
- పోటీ పడుతున్న సుగర్, బీపీ వ్యాధులు
- ప్రజల్లో అవగాహన పెంచాలి
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఏలూరు క్రైం/పాలకొల్లు/పోలవరం ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. అందరూ బావుండాలి అందులో మనం ఉండాలి. మనం.. మన చుట్టూ ఉన్న సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఒకప్పుడు శారీరక శ్రమే ఎక్కువగా ఉండేది. నాడు గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఏ చిన్న వస్తువు కావాలన్న కాలినడకనో, సైకిల్ పైనో వెళ్లి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండానే ఇంటికి వచ్చేస్తున్నాయి. శరీరానికి సుఖం అలవాటు చేసేశారు. శారీరక శ్రమ లేకపోవడంతో రక్త ప్రసరణలో మార్పులు లేక తెలియకుండానే చాపకింద నీరులా రోగాల బారినపడిపోతున్నారు. వయోబేధం లేకుండా ఆరోగ్య సమస్యలు పౌరులను పరుగులు తీయిస్తున్నాయి. నిత్యం వదలని వ్యాధులు కొన్నయితే పలకరించి పారిపోయే వ్యాధులు అనేకం. నేడు కుటుంబానికో రోగి అనటం అతిశయోక్తి కాదు. మొత్తంగా చెప్పు కుంటే మానవ సమాజం రోగాల పుట్టగా మారు తున్నది. సామాన్య మధ్య తరగతి కుటుం బాలలో నెలబడ్జెట్‌లో పావు వంతు మందులకు ఖర్చు పెడుతు న్నారు. అధిక శాతం కుటుం బాలలో నిత్యా వసరాల జాబితాలో ఔషధాలు చేరాయి. సుగర్, బీపీ వ్యాధులు పరుగులు తీస్తున్నాయి. మరో వైపు క్యాన్సర్ వ్యాధి అనేక మంది ఆరోగ్యాన్ని కబలించి వేస్తున్నది. ప్రజలకు రోగాల పట్ల అవగాహన కల్పించాలి. వైద్యం ఉచితం చేయాలని కోరుతున్నారు.

ఒక సర్వే ప్రకారం కలుషిత తాగునీటి వల్లనే 60 శాతం రోగాలు వస్తున్నాయని డబ్ల్యు హెచ్‌వో వెల్లడించింది. సాధారణ రోగాలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు మానవ తప్పిదాలు వల్లే సంభవిస్తున్నాయని వైద్య వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. ఇటీవలే రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేస్తున్న పరిస్థితిపై పాలకొల్లు మున్సిపాలిటికీ తాఖీదులు ఇచ్చింది. సంబంధిత అధికారులను వివరణ కోరింది. అయినప్పటికీ వివిధ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తగల బెడుతున్నారు. మంటల నుంచి వెలువడే రసాయనాలు పీల్చడం ద్వారా క్యాన్సర్ వంటి బారిన పడుతున్నారు.

ఏలూరు జిల్లాలో సుమారు 23 లక్షల జనాభా ఉండవచ్చు. జిల్లాలో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏ ఇల్లు చూసిన ఎవరో ఒకరు షుగరు, బీపీ దీర్ఘకాలిక వ్యాధితో కనిపిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం కిడ్నీలకు సంబంధించిన వ్యాధి గ్రస్తులే ఉన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రోజుకు 1000 మంది వరకూ బీపీ, సుగరువ్యాధిగ్రస్తులు వెళ్ళి వైద్యం చేయించుకుంటున్నారు.

ప్రతీ ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) 1948లోనే తొలిగా ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించినప్పటికీ 1950వ సంవత్సరం ఏప్రిల్ 7న జరుపుతున్నారు. "ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశాజనక భవిష్యత్తు" అనే నినాదంతో ఈ ఏడాది ఆరోగ్య దినోత్సవం నిర్వహించనున్నారు.

వ్యాధులకు కారణాలెన్నో..

ఆహార పదార్థాలు రంగులు కలపడం, కల్తీ చేయడం, పాలిష్డ్ రైస్ తినడం, జంకుఫుడ్, కల్తీ నూనెలతో తయారుచేసిన వంటకాలు తినడం, కల్తీ పాలు, కల్తీ ఆహార పదార్థాలతో తెలియకుండా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. స్వీట్ షాపుల్లో మితిమీరి కాక నూనె వినియోగిస్తున్నప్పటికీ నిత్యం వేల సంఖ్యలో ఆ పదార్థాలను తిని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

» ఊటుకూరులో ఉద్రిక్తత

ముదినేపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండల ఊటుకూరులో ఆదివారం రాత్రి పోసిన సురేష్ అనే యువకుడు మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఈ యువకుడు గత ఏడాది వినాయకచవితి పండుగ రోజున హత్యకు గురైన బాలకోటయ్య కుమారుడు. అప్పటినుంచి ఆ యువకుడు తరచూ మద్యం తాగి వీరంగం చేస్తూనే ఉన్నాడు. తాజాగా ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. మరో యువకుడితో కలిసి సురేష్ చేస్తున్న వీరంగంపై కొంతమంది గ్రామస్థులు ముదినేపల్లి పోలీసులకు సమాచారం అందించగా కొద్ది సేపటికి గ్రామానికి వచ్చిన పోలీస్ సిబ్బందిపై వారు తిరగబడి దుర్భాషలాడుతూ రెచ్చిపోయారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ వీరభద్రరావు మరికొంతమంది సిబ్బందితో వచ్చి సురేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ యువకుడు ఇటీవల ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లోనూ మద్యం మత్తులో వీరంగం సృష్టించగా అతడిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. బాలకోటయ్య హత్య అనంతరం అతని కుమారుడు తరచూ అల్లరి చేస్తూ ఉండడం గ్రామంలో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

ముదినేపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులో శ్రీరామ నవమి సందర్భంగా కోలాట గురువు మీగడ సత్యనారాయణ సారధ్యంలో స్థానిక కోదండరామ కళాబృందం చిన్నారులు తొలి మురళీ కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కోలాటం నేర్చుకునేందుకు చిన్నారుల బృందానికి టీడీపీ నాయకుడు బొర్రా చలమయ్య రూ.25వేలు విరాళం అందజేశారు. కోలాటం గురువు సత్యనారాయణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజును కోలాట బృందం సత్కరించింది.





ఆటపాక రామాలయం స్వామి వారి కల్యాణంలో భక్తులు, సింగరాయపాలెం కోదండ రామస్వామి ఆలయం.. నూజివీడు-బత్తులవారి గూడెంలో సీతారాముల కల్యాణం

కన్నుల పండువగా రాములోరి కల్యాణం

» వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
» భక్తులతో ఆలయాలు కిటకిట

పట్టణ, గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. వేదపండితుల వేదమంత్రాలు, మేళతాళాలు, మంగళవాయిధ్యాల నడుమ రాములోరి కల్యాణాలు నిర్వహించారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

నూజివీడు టౌన్/ముసునూరు/చాట్రాయి/ఆగిరిపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడులోని బత్తులవారిగూడెం సీతారామ స్వామి దేవస్థానంలో టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా దంపతులు, పలువురు గ్రామస్థులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. నూజివీడు పట్టణం వెలమపేటలో మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముసునూరు మండలం ముసునూరు పడమట రామాలయంలో టి.మధుసూదనరావు, శివకుమారి దంపతులు, తూర్పు రామాలయంలో తులిమెల్లి ప్రసాద్, కృష్ణకుమారి దంపతులు, ఆర్యవైశ్య రామమందిరంలో వంకదారు మల్లికార్జునరావు దంపతులు, చెక్కపల్లిలో కోదండ రామాలయంలో నండూరి మధుబాబు, ఓబిళ్లనేని శ్రీనివాసరావు, కొత్తగుంట్ల ప్రభాకరరావు దంపతులు పీటలపై కూర్చొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. గోగులంపాడు రామాలయంలో గ్రామస్థుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం చెక్కభజనలు, కోలాటాలు, సన్నాయి మేళాలతో స్వామివారి కల్యాణమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. చాట్రాయి మండలం చాట్రాయిలో సీతారామ చంద్రస్వామి ఆలయం ఎదుట పందిరిలో సీతారాముల కల్యాణం జరిగింది. భక్తులు భారీగా పాల్గొనగా అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. బూరుగుగూడెం రామాలయంలో రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, హైమావతి దంపతులు కల్యాణం జరిపారు. జనార్దనవరం మాలపల్లి దళితవాడ రామాలయంలో సీతారాముల కల్యాణం జరిగింది. ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లిలో సీతారాముల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి, ఆలయంలో కల్యాణం జరిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆగిరిపల్లిలోని పోగడచెట్ల మండపం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు/కలిదిండి/మండవల్లి/ముదినేపల్లి:కైకలూరు పట్టణంలోని కైకలూరు కుమ్మరివీధి, రైల్వేస్టేషన్ దగ్గర, వెలమపేట రామాలయం, కాపులవీధి రామాలయం, సత్యసాయి సేవా మందిరం, రామకృష్ణ సేవా సమితిలో రాములోరి కల్యాణాన్ని నిర్వహించారు. ఆటపాక రోడ్డుపక్కన రామాలయంలో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కలిదిండి మండలం తాడినాడలో అపర భద్రాద్రిగా పేరొందిన రామాలయంలో అల్లూరి అచ్యుత రామరాజు-సరస్వతీ దంపతులచే, పెదలంక రామాలయంలో కోకా రాజు దంపతులచే, కలిదిండి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన, గ్రామోత్సవం నిర్వహించారు. కూటమి నాయకులు అక్కల వెంకటాచలం, దున్న భోగేశ్వరరావు పాల్గొన్నారు. మండవల్లి మండలం మండవల్లి కోదండ సీతారాముల వారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితులు చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గ్రామస్థుల ఆర్థిక సహకారంతో సీతాసమేత శ్రీరాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండవల్లి వెలమపేటలో వెలమపేట వాసులు, గ్రామస్థులు శ్రీరామనవమి సందర్భంగా వేసిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది. వెలమపేట సంఘం నాయకుడు నల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోదండ రామాలయం వద్ద చిన్నారులు, మహిళలు కోలాటం వేశారు.

- ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని బావాజీమఠంలో వున్న కోదండ రామస్వామి దేవస్థానంలో స్వామివార్ల తిరు కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. యాజ్ఞికుడు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ శిష్యుడు ఆసూరి రంగనాథాచార్యులు కల్యాణం నిర్వహించారు. టీడీపీ నాయకులు బొంగు రవికుమార్, బూరుబోయిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లిలోని సీతారామస్వామి ఆలయంలో అర్చకుడు బృందావనం శ్రీనివాసాచార్యులు స్వామివార్ల కల్యాణం జరిపించారు. స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కందగడ్డల నాగరాము, లక్ష్మీ ప్రహర్ష దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు.

ఆది గురువులకు భోగ్..

బావాజీమఠం సంప్రదాయం ప్రకారం బంజారీలు తమ ఆదిగురువులైన సంత్ సేవాదాస్ మహరాజ్, గురు జగ్‌మల్ దాస్ మహరాజ్ పీఠం వద్ద శ్రీరామనవమి సందర్భంగా భోగ్ నిర్వహించారు. బంజారీల భక్తసమాజ్ నాయకులు బాణావత్ శ్రీరాములు నాయక్, భూక్యా వెంకటేశ్వరరావు నాయక్, నల్లగొండ గురుబావాజీ ఆధ్వర్యంలో నల్గొండ, కొత్తగూడెం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో బంజారీలు తమ ఆదిగురువులకు పూజలు జరిపారు. ఆచార సంప్రదాయల నృత్యాల అనంతరం అన్నసమారాధన జరిగింది



మండవల్లిలో పునఃప్రతిష్ఠ చేసిన సీతారామలక్ష్మణ స్వామి విగ్రహాలు



చనుబండలో కల్యాణానికి తలంబ్రాలు తీసుకువస్తున్న ఆలయ నిర్మాత పుచ్చకాయల రామిరెడ్డి వారసులు





ఆగిరిపల్లి రామాలయం.. ముసునూరు పడమట రామాలయం.. తాడినాడ రామాలయాల్లో సీతారాముల కల్యాణం





కైకలూరులో ఎంపీపీ అడవి కృష్ణ.. నూజివీడులో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు ఎం.నాగరాణి, కలిదిండిలో పార్టీ జెండాలు ఆవిష్కరించిన నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కైకలూరులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద బీజేపీ జెండాను ఎగుర వేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు కీర్తి వెంకటరాంప్రసాద్, పేరిచర్ల ప్రసాదరాజు, బోయిన శ్రీనివాసు, బోడావుల జగదీష్, బొల్లా శ్యామలరాజుగౌడ్, పైడిపాటి శివశంకర్, బోడావుల నాంచారయ్య, పెద్దింటి కల్యాణి, తదితరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం కలిదిండిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంకాల దుర్గాప్రసాద్, నాయకులు నంబూరి బాండురాజు, చిట్టూరి రవీంద్ర, కోకా శ్రీనివాసరావు, సూదాబత్తుల రాధాకుమారి, సుభాషిణి, కాళ్లపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం సెంటర్‌లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్స వం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు పసుపులేటి నరసింహారావు, కార్యదర్శి కొల్లిపర నాగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బండారు పాండురంగారావు, నాయకులు మేలిమి చిట్టిబాబు, నీలం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం మండవల్లి, చింతపాడు, పలు గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మండవల్లి మెయిన్ రోడ్డులో బీజేపీ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. నాయకులు గుడివాడ చిట్టిబాబు, బోయిడి సురేష్, ఏసుబాబు, బండి దివాకర్, టీడీపీ నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

- నూజివీడు/చాట్రాయి : నూజివీడులోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్, రామాయమ్మారావు పేట వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు బోను అప్పారావు, వైఎస్ దొరై, ఎం.రాజశేఖర్, మాటూరి రవికాంత్, మాటూరి ప్రసాద్, మాగంటి వాసు మాస్టర్, అనమల నాగేశ్వరరావు, అంబటి మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లికార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్ పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో చాట్రాయి, చనుబండ, కృష్ణారావుపాలెం, పోలవరం గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, ముత్తారెడ్డి, శ్రీకర్, చెన్నారావు, నెక్కలపు వెంకటేశ్వరరావు, ఆదిమూలం శర్మ, గోపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ స్టాఫ్ క్వార్టర్స్‌లో చోరీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో భద్రత లోపం మరోసారి బయటపడింది. క్యాంపస్‌కు సంబంధంలేని బయట వ్యక్తులు అనధికారికంగా ఉంటున్న ఘటనలు మరువకముందే పటిష్ఠ భద్రత ఉంటుందని చెబుతున్న ఐటీ క్యాంపస్‌లోని స్టాఫ్ క్వార్టర్స్‌లో శనివారం చోరీ జరగడం చర్చనీయాంశమైంది. మెంటర్ క్వార్టర్ ఎస్-1 బ్లాక్‌లోని ప్లాట్ నంబర్ 103, 303ల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం చోరీకి విషయం గమనించిన సెక్యూరిటీ ఈ విషయాన్ని ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులకు తెలుపగా సమాచారాన్ని నూజివీడు పోలీసులకు అందించారు. నూజివీడు పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరిస్తున్నారు. రెండు ప్లాట్లలో ఉంటున్న ఇద్దరు మెంటర్లు రెండు రోజుల నుంచి క్వార్టర్స్‌లో లేకపోవడం క్యాంపస్ వెనుక వైపు గోడ కూలిపోయి ఉండడం వల్లే చోరీ జరిగినట్టు తెలుస్తోంది.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో ఆదివారం గుండెపోటుకు గురై మరణించిన పరిసిపోగు శివాజీ(60) అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేల సహాయం అందించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వైష్ణవి, తండ్రి డాక్టర్ మనోజ్ ఈ సహాయాన్ని అందజేశారు.

అదుపుతప్పి కారు బోల్తా

మండవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ లంక గ్రామ సమీపంలో ఆదివారం కొల్లేరులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారి పక్కన కొవ్వాడ లంక వద్ద కారు బోల్తా పడటాన్ని గమనించిన స్థానికులు బాధితులను బయటకు తీసేశారు. ఇద్దరికి గాయాలైనట్లు వారు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475

ఆత్మీయ కలయిక

మండవల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం కాకతీయ నగర్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉప్పాల కోదండ రామయ్య ఇంట నాలుగుతరాల కుటుంబసభ్యులు ఆదివారం 'ఆత్మీయ కలయిక' నిర్వహించారు. దీనిలో కోదండరామయ్య నలుగురు కుమారులతో పాటు ముగ్గురు కుమార్తెలు, మనుమలు, ముది మనుమరాండ్రుతో రోజంతా సంతోషంగా ఆటపాటలతో గడిపారు. ముప్పాల చరితఉష నిర్వాహకురాలిగా వ్యవహరించారు. అనంతరం పెద్దలను గౌరవిస్తూ పాదపూజ నిర్వహించారు. చిన్నారులు కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

